### డిజిట్-మెరిట్



# 2,500

కోట్ల రూపాయలు

బతుకమ్మ పండుగ సందర్భంగా ఏటా కోటి మంది తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చే 'బతుకమ్మ చీరల'పై ఇప్పటివరకూ ప్రభుత్వం వెచ్చించిన మొత్తం.


### థర్డ్ అంపైర్



తెలంగాణ వయసులో చిన్నదే కావచ్చు, అభివృద్ధిలో కాదు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఏటా 9 శాతానికి పైగా సమ్మిళిత వృద్ధి సాధిస్తున్నది.

■ రాజీవ్‌కుమార్,
నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు

### థౌజండ్ వాలా..







హైదరాబాద్ | శుక్రవారం 10 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ


# తెలంగాణ జైత్రయాత్ర 2023


www.ntnews.com




## కిడ్నీ రోగులకు అండగా ఉంటాం

సందర్భాన్ని బట్టి కొన్ని పథకాలు రూపకల్పన చేస్తుంటాం. దానిని ఉచితం అంటే ఎలా! డయాలసిస్ పేషెంట్లు ఉంటరు. వాళ్ల బాధలను ఇంత వరకు ఎవరూ పట్టించుకోలే! వాళ్లకు కూడా పెన్షన్లు ఇచ్చుకుంటున్నం. ప్రతినెలా 2,016 అందిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 103 డయాలసిస్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. కిడ్నీ వ్యాధి బాధితులకు ఉచిత డయాలసిస్ చేస్తున్నాం. వాళ్ల మీద ప్రయాణ భారం పడకుండా ఉచిత బస్‌పాస్ సౌకర్యం కూడా కల్పించాం. ఏ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి లేదు.

■ కేసీఆర్

# కాంగ్రెస్, బీజేపీ ముంచే పార్టీలు

**ఇంతకాలం బీఆర్ఎస్‌ను విమర్శించిన దరువు ఎల్లన్న.. ఇప్పుడు అదే పార్టీలో చేరారు. కారణం?**

ఆ సమయంలో నేను ఉన్న పార్టీల ఒత్తిడి వల్ల అలా మాట్లాడాల్సి వచ్చింది. ఇన్ని రోజులు ఇంటి నుంచి తప్పిపోయి ఇప్పుడు మళ్లీ సొంతింటికి వచ్చానన్న ఫీలింగ్‌లో ఉన్నా. రాజకీయ పార్టీలో చేరానన్న భావన నాలో లేదు.

**ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల మీద రేవంత్‌రెడ్డి కామెంట్స్‌పై మీ స్పందన?**

విద్యార్థులను ఇప్పుడే కాదు.. ఉద్యమ కాలం నుంచీ కాంగ్రెస్ పార్టీ అవమానిస్తున్నది. 'తార్నాకలో బీర్లు తాగి లొల్లి చేస్తరు' అన్న రేవంత్ మాటలు ఆయన అహంకారాన్ని నిరూపిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ రెండూ విద్యార్థులను నాయకులుగా గుర్తించవు. ఈ రెండు పార్టీలూ ప్రజలను ముంచేవే!

**విద్యార్థి ఉద్యమ నేతగా మీకు బీజేపీలో సముచిత స్థానం దక్కలేదని భావించారా?**

ఒక్క బీజేపీలో మాత్రమే కాదు, కాంగ్రెస్‌లో కూడా విద్యార్థి నేతలు, ఉద్యమకారులకు సముచిత స్థానం మాట దేవుడెరుగు.. కనీస గౌరవం ఉండదు. వాళ్లకు ఎంతసేపు కోట్లు, సూట్‌కేసులు ఇచ్చేవాళ్లే కనిపిస్తారు. అదే తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ గారు ఆయనతో సమానంగా మాకు వేదిక అందించారు. వాళ్లు కనీసం కష్టపడి పనిచేసిన విద్యార్థి నాయకుల పేర్లు కూడా ప్రస్తావించరు.

ఫటాఫట్



దరువు ఎల్లన్న

Interview

**దళితులకు ఏమీ చేయని బీజేపీ.. దళితబంధు పథకం తెచ్చిన బీఆర్ఎస్ ఈ రెండు పార్టీల గురించి ఏం చెబుతారు?**

బీజేపీ దళిత వ్యతిరేకి. మతతత్వ పార్టీ. దళితుల ఓట్ల కోసం మాటలు చెప్పడం తప్ప ఇప్పటి వరకు దళితులకు చేసిందేమీ లేదు. దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచించి దళితబంధులాంటి మహోన్నత పథకం తెచ్చిన బీఆర్ఎస్, కేసీఆర్ గురించి రెండు మూడు మాటల్లో చెప్పలేం.సంక్షేమం అంటే బీఆర్ఎస్ మాత్రమే.

**ఉద్యమ సమయంలో ఎన్నో పాటలు రాశారు. ఇప్పుడు ప్రగతిపథంలో సాగుతున్న తెలంగాణ గురించి మీ నుంచి పాట ఎప్పుడు వస్తుంది?**

'వీరులారా వందనం' పాట ఖండాంతరాలు దాటి.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను, అమరవీరుల ఖ్యాతిని చాటింది. 'ఏమయి పోతున్నదో తెలంగాణ.. ఎటుగాని తీరాయెనో' అని ఆగమైన తెలంగాణ ఆవేదన గురించి రాశాను. ప్రగతి తెలంగాణ గురించి త్వరలో రాస్తా.

**తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి దరువు ఎల్లన్న కామెంట్?**

సంక్షేమ పథకాలకు రోల్ మాడల్ తెలంగాణ. మా నాయకులు కేసీఆర్, కేటీఆర్ చెప్పిన మాటే నాది కూడా. తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది.

**మీతోటి విద్యార్థి నేతలు, కవులు, కళాకారులకు మీరిచ్చే పిలుపు?**

అందరికీ నా విన్నపం ఒకటే! కాంగ్రెస్, బీజేపీలను నమ్మకండి. మనల్ని, మన ఆవేశాన్ని వాళ్ల అధికారం కోసం వాడుకుంటాయి. ఒకప్పుడు తెలంగాణ సాధించుకోవడానికి మనమంతా ఏకమయ్యాం. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ కబంధ హస్తాల్లో చిక్కకుండా తెలంగాణను కాపాడుకోవడానికి మరోసారి ఏకమవుదాం.

■ సుంకరి

### ఖుల్లం ఖుల్లా

మతతత్వపు విషనాగులు బుసలు కొడుతున్నాయి
విద్వేషపు పెనుమంటలు చుట్టుముట్టు చేరాయి
ప్రేమ, కరుణ, ప్రగతి తెలంగాణ అస్తిత్వం
ఎన్నటికీ నెరవేరదు మీ కుటిల ప్రయత్నం

కాంగిరేసు గుర్రం సకిలిస్తుంది
కార్పణ్యం అసూయతో ఇకిలిస్తుంది
తాతల నేతుల గాథలు నెమరవేస్తుంది
తైతక్కలు ఆడుతూ దరువులే వేస్తుంది

... దండమూడి శ్రీచరణ్

## అసలు ముచ్చట



'ఎంత డబ్బుంటేనేం... ఒక్కరోజు మనిషి ఊపిరిని ఆపలేం కదా!' అన్న ఆలోచన చాలాసార్లు వస్తుంది. కానీ, అవే డబ్బులు... కొన్నిసార్లు ఏండ్ల తరబడి మనిషి ప్రాణాన్ని నిలబెట్టగలవు. డయాలసిస్ రోగుల విషయంలో ఇది అక్షర సత్యం.

# మా ఊపిరి కేసీఆర్!



**రెండు కిడ్నీలు ఫెయిల్... అన్నమాట వింటే పదేండ్ల క్రితం సాధారణ జనం ప్రాణాల మీద ఆశ వదులుకునేవారు. ఒక్క డయాలసిస్‌కే వేల రూపాయలు ఖర్చయ్యే చోట, వారానికి రెండు, మూడుసార్లు చేయించుకోవడం అన్నది... సంపన్నులు, ఎగువ మధ్యతరగతి వాళ్లకు తప్ప.. పేదవారికి కలలోని మాట. కానీ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. ప్రతి పేద రోగికీ ఉచితంగా డయాలసిస్ అందేలా రాష్ట్ర వ్యాప్తంగా 103 రక్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయించారు. ఉచిత బస్‌పాస్‌లతో పాటు, పింఛనూ ఇచ్చారు.**

## ఇది కిడ్నీ వ్యాధిగ్రస్తుల మాట

- ఉచిత డయాలసిస్ సేవలతో ఊరట
- నిరుపేద రోగులకు సర్కార్ బాసట
- ఘనమైన వైద్యం.. మెరుగైన సేవలు
- ప్రతి నియోజకవర్గానికీ రక్తశుద్ధి కేంద్రం

కేసీఆర్ తమకు ఏండ్ల ఆయుష్షును పోశారని అంటున్నారు ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విజయ, కళావతి, మోహన్ రెడ్డి, అనిత, శంకర్, పరమేశ్వర్, సర్వేశ్... లాంటి కొందరు నిమ్స్ ప్రాంగణంలో కలుసుకున్నారు. వాళ్లు తమ కోసం ప్రభుత్వం చేస్తున్న సాయం గురించి ఏం మాట్లాడుకున్నారో మీరూ చదవండి...

| | |
|---|---|
| రాష్ట్రంలో మొత్తం డయాలసిస్ కేంద్రాలు **103** | రోగులకు ఆసరా రూ. **2,016** పింఛన్, ఉచిత బస్‌పాస్ |
| తొమ్మిదేండ్లలో ఉచిత సేవలు పొందిన రోగులు సుమారు **80** వేలు | ప్రతి సంవత్సరం జరుగుతున్న కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లు **150**కి పైగా |

**విజయ:** మేం కిస్మత్‌పురలో ఉంటం. మా ఆయన తాపీ మేస్త్రీగా పనిచేస్తడు. నాకు అయిదేండ్ల కింద రెండు కిడ్నీలూ ఫెయిలయినయ్. అప్పటి నుంచి డయాలసిస్ చేయించుకుంటున్న. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలన్నరు డాక్టర్లు. గవర్నమెంటు ఫ్రీగా చేస్తున్నది కాబట్టి బతుకుతున్న. లేకపోతే నేను ఏమయ్యేదాన్నో, నా బిడ్డలు ఏమైపోదురో అనిపిస్తుంటది!

**పరమేశ్వర్:** అవును, మా పరిస్థితి కూడా అంతేనమ్మా! ఏ రోజుకారోజు పొట్ట పోసుకునే మనలాంటోళ్లు గిన్ని పైసలు ఎక్కడ పెడ్తం. ఏండ్లకేండ్లు ఇంత వైద్యం ఎట్లా చేయించుకుంటం. కేసీఆర్ సర్కారు ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే నేను ఇన్నేండ్లు బతకకనే పోదునేమో! అనుకోవడం కాదు, నిజంగా బతికి ఉండేవాడిని కాదు. మా తమ్ముడికి 2006లో ఇదే కిడ్నీ బీమారి వచ్చింది. అప్పటికప్పుడు డయాలసిస్ చేయిస్తేనే బతుకుతాడని డాక్టర్లు చెప్పిన్రు. మాది చిన్న కిరాణా దుకాణం. మావోడు బతకాలంటే వారానికే వేలకు వేలు కావాల్సొచ్చింది. ఏడ్నుంచి తేవాలి? అప్పుసొప్పు చేసి, కొంచెం డబ్బు జమ చేసి కొన్ని రోజులు వైద్యం చేయించినం. తర్వాత మాకు చేతకాలేదు. పాతికేండ్లకే మా తమ్ముడు చచ్చిపోయాడు. వాణ్ని తలచుకున్నప్పుడల్లా 'మా పేదరికం వల్లనే వాణ్ని దూరం చేసుకున్నం కదా' అని బాధనిపిస్తది. అప్పటికి మన రాష్ట్రం రాలేదు. ఇన్ని వసతుల్లేవు. ఇట్ల ఉచితంగా డయాలసిస్ అప్పుడు ఎక్కడిది?





**శంకర్:** డబ్బులు తెచ్చిన బయట మోసం చేస్తరే అన్నా. మాది దేవరకొండ దగ్గర పోలేపల్లి. ఆర్టీసీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేసే వాణ్ని. మొన్న ఏప్రిల్‌లో సుస్తీ చేస్తే హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు దవాఖానలో చూపించుకున్న. కిడ్నీలు పోయినయ్ అన్నరు. ఒక్క డయాలసిస్‌కు ముప్పై వేలు వసూలు చేశారు. పదిహేను రోజుల్లో అయిదు లక్షలు తీసుకొని, మూడు రోజుల కన్నా ఎక్కువ బతకడని చెప్పారు. నా భార్య.. వాళ్ల అన్నదమ్ముల దగ్గర అప్పుతెచ్చి అయిదు లక్షలు కట్టింది. ఇంక మాకు చేతకాక ఇంటికొచ్చేశాం. మా ఇంటి పక్క వాళ్లు చెబితే నిమ్స్‌లో చూపించుకుంటున్నాం. ఇక్కడ కిడ్నీ బయాప్సీ చేసి ఢిల్లీకి పంపించి రిపోర్టులు తెప్పించారు. డయాలసిస్ ఫ్రీగా చేస్తున్నరు. లేకపోతే నా ఇల్లూవాకిలీ అమ్ముకున్నా ఈ వైద్యం చేతనయ్యేది కాదు.



**సర్వేశ్:** మేం కూడా నెల రోజుల్లోనే ఏడు లక్షలు ఖర్చు పెట్టుకున్నం. అశ్వాపురం దగ్గర గొంది గూడెం నుంచి మా అబ్బాయికి చూపిద్దామని ఇక్కడికి వచ్చాం. పోయినసారి పెద్దగోదారి వచ్చినప్పుడు మా వాడికి డెంగ్యూ జరమొచ్చింది. జరం ఎక్కువై రెండు కిడ్నీలూ పోయాయి. వాడికి ఇరవై మూడేండ్లు. కన్నకొడుకు కండ్లముందు ఆగమైతుంటే కడుపు తరుక్కుపోయింది. పిల్లగాన్ని ఎట్లనన్న కాపాడుకోవాలని ఏడు లక్షలు ఖర్చు పెట్టినం. డబ్బులన్నీ అయిపోయినయ్. ఎట్లరా భగవంతుడా! అనుకున్నా. మా దగ్గరే గవర్నమెంట్ దవాఖానలో డయాలసిస్ చేస్తున్నరని తెలిసింది. అప్పటి నుంచి అక్కడే చూపిస్తున్నం. చేతిల నరం పోయిందని నిమ్స్‌లో చూపించుకోమంటే ఇక్కడికి వచ్చినం.

**మోహన్ రెడ్డి:** ఇగ ఈ రోగం వస్తే, అంతా తిరుగుడే అయితది. బస్సు కిరాయిలు మీద పడకుండా మనకు ఫ్రీగ బస్‌పాస్‌లు ఇచ్చిందిగా గవర్నమెంటు. అది చాలా మందికి మేలయ్యింది. పెన్షన్ డబ్బులు కూడా జర తిండికో, మందులకో అయితున్నయ్. ఇవి లేకపోతే ఇంకా కష్టమయితుండే!

**విజయ:** ఈసారి గూడా బీఆర్ఎస్ సర్కారు వస్తే పింఛను పెంచుతరంట. నేనయితే అదే వస్తే బాగుండు అనుకుంటున్న. అదొక్కటే కాదు, ఇంతకు ముందు నిమ్స్‌కు డయాలిసిస్ కోసం వస్తే నా వంతు వచ్చేసరికి మూడు రోజులు పట్టేది. అసలే పానం బాగలేక బాధతోని ఉండిగూడ, ఇక్కడ పడిగాపులు కాయాల్సొచ్చేది. ఇప్పుడు మిషన్లు చాలా వచ్చినయ్. టయానికొచ్చి, చేయించుకొని పోతున్నం. కిడ్నీలు గూడ చాలామందికి (ట్రాన్స్‌ప్లాంటేషన్) పెట్టిర్రు. నాక్కూడా పెడతరని పేరిచ్చిన.

**పరమేశ్వర్:** నాకయితే కేసీఆర్ సర్కారే ప్రాణం పోసింది. కాబట్టి మళ్లీ తప్పకుండా దానికే ఓటేస్త. సారే రావాలనీ, మనలాంటి చాలా మంది పేదలకు సాయంజేయాలనీ కోరుకుంటున్న. జై కేసీఆర్!

... లక్ష్మీహరిత ఇంద్రగంటి

📷 వీరగోని రజనీకాంత్‌గౌడ్

### ఎటమటం!

## సీఎం అంటే సదా ఇంతేస్!

సీఎం క్యాండెట్‌ను తానంటే తానేనని కాంగ్రెస్‌లో నిన్నమొన్నటి దాకా ఓ అర డజన్ మంది నేతలు బిల్డప్ ఇచ్చారు. కానీ సడన్‌గా ఏమైందో ఏమో కానీ రాత్రికి రాత్రి వారంతా ఇప్పుడు ఏ అదంతా ఉత్తుత్తిదేనని ప్లేట్ ఫిరాయిస్తున్నారు. చెప్పింది నిజమే కానీ అది ఈసారికి కాదు...ఓ పది పదిహేను ఏండ్ల తర్వాత అని గడ్డం జగ్గన్న బహిరంగ సభలోనే ప్రకటించగా, జీవితంలో ఎప్పుడో ఒకసారి సీఎం అవుతా అంటూ ప్రస్తుతానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాయిదా వేసుకున్నారు. అసలు ఏం జరిగింది...వీరంతా రేస్ నుంచి ఒక్కొక్కరుగా ఎందుకు తప్పుకుంటున్నారు? అనే చర్చ షురువైంది. కాంగ్రెస్ గెలవడం కష్టమనుకొని అలా మాట్లాడుతున్నారా? లేక సీఎం ఎవరనే టాపిక్ గురించి మాట్లాడొద్దని అధిష్ఠానం ఏమైనా వార్నింగ్ ఇచ్చిందా?... అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లోగుట్టు పెరుమాళ్ళకెరుక అన్నట్టు ఈ విషయంపై ఆ పార్టీ సీనియర్ నేతలను ఆరా తీస్తే, సీఎం రేస్‌లో ఉన్నామంటే అటు ప్రత్యర్థి పార్టీ నుంచి గట్టిపోటీ. ఇటు పార్టీలో సీఎం రేసులో ముందున్న నేతలకు కంటగింపు. సీఎం రేసు నుంచి తప్పించడానికి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థితో లోపాయికారీ సంబంధం పెట్టుకొని వెన్నుపోటు పొడిచేందుకు కూడా వెనుకాడరు వీళ్లు. గత ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ గెలిస్తే ఎక్కడ సీఎం అవుతాడో అని ఒక వర్గం నేతలంతా చీకట్లో చేతులు కలిపి పనిగట్టుకొని ఓడించారు. అదలా ఉంచితే, ఈ సారి కాంగ్రెస్ టికెట్లకు కోట్లకు కోట్లు పలికాయి. వచ్చిన దాంట్లో రెండు టికెట్ల పైసలు తమవి కాదనుకుంటే సీఎం రేసులో ఉన్న నేతలను ఓడించి ఇంటికి పంపవచ్చు. ఈ కుట్రలు, కుతంత్రాలు కాంగ్రెస్‌లో కొత్తేమీ కాదు. ఆ విషయం తెలిసే, రేస్‌లో తాము లేమని పరోక్షంగా హింట్ ఇస్తున్నారని పూసగుచ్చినట్టు వివరించారు.

■ వెల్జాల

